

కారు రేసులో వీరే..

బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యేల జాబితాలో సికింద్రాబాద్, సనత్‌నగర్ నుంచి సిట్టింగ్‌లకే టికెట్టును ఖరారు చేయగా, కంటోన్మెంట్ నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందితను బరిలోకి దింపనున్నారు. సోమవారం సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ మొదటి జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో ఆయా అభ్యర్థుల గురించి..

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం

సనత్‌నగర్: తలసాని శ్రీనివాస్‌యాదవ్



రాజకీయ నేపథ్యం: మొట్టమొదటిసారిగా 1994లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక. 1995–1998 కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1999లో సికింద్రాబాద్ నుంచే రెండోసారి ఎమ్మెల్యేగా, 2001–2004 పర్యాటకం, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీఆర్‌ఎస్‌లో చేరి వివిధ శాఖల మంత్రిగా కొనసాగారు. 2018లో సనత్‌నగర్ నుంచే మొట్టమొదటిసారిగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొంది పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

బలాలు

- నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి.
- గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన దీర్ఘకాలిక సమస్యలు అయిన బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ముస్లిం గ్రేవ్ యార్డు నిర్మాణం, సనత్‌నగర్ మంచినీటి రిజర్వాయర్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, జీరా ప్రాంతంలో లీజు ల్యాండ్‌లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారి ఇళ్ల స్థలాలను ఫ్రీ హోల్డ్ చేస్తూ జీఓ జారీ, రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు పూర్తి చేయడం.

బలహీనతలు..

- గడిచిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మూడు ప్రధానమైన డివిజన్లు బీజేపీ ఖాతాలోకి వెళ్లడం. ఆయా డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు ఉత్సాహంగా పనిచేస్తూ ఆ పార్టీ క్యాడర్‌ను విస్తరించుకుంటూ వెళ్లడం.
- ఇక కొంతమంది కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు క్రింది స్థాయిలో వసూళ్ల పర్వానికి దిగడం కొంత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రతికూల పరిస్థితులను తెచ్చిపెడుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.
- వేల సంఖ్యలో దళితులు ఉండగా కేవలం ఇప్పటి వరకు 100 మందికి మాత్రమే దళితబంధు కింద లబ్ధి చేకూర్చడంతో మిగతా వారిలో అసంతృప్తి నెలకొంది.
- వన్‌మ్యాన్ ఆర్మీ లా తానే సొంత నిర్ణయాలు తీసుకుంటూ కార్పొరేటర్లు, కిందిస్థాయి నాయకులు చెప్పే అంశాలను వినీ విననట్లుగా వ్యవహరిస్తారని సొంత పార్టీలో అసంతృప్తి నెలకొంది.

సికింద్రాబాద్: టీ.పద్మారావుగౌడ్



రాజకీయ నేపథ్యం: 1973 నుంచి 1985 వరకు యువజన కాంగ్రెస్, కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. 1986లో హిస్సాంగంజ్ మోండా డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది ఎంసీహెచ్ కార్పొరేటర్‌గా గెలుపొందారు.

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక. 2002లో జీహెచ్‌ఎంసీ అదే డివిజన్ నుంచి రెండోసారి కార్పొరేటర్‌గా గెలుపొందారు. పదేళ్లపాటు టీఆర్‌ఎస్ పార్టీ గ్రేటర్ అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2004 ఉమ్మడి ఏపీ శాసనసభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి అప్పటి టీడీపీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై గెలుపొందారు.
- 2008 ఉప ఎన్నికలో తిరిగి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతిలో పరాజయం పాలయ్యారు.
- 2009 శాసనసభ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి చేతిలో పరాజితులయ్యారు.
- తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం 2004 ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రిగా పనిచేశారు.
- 2018 ఎ్నకల్లోనూ మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రస్తుతం శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్నారు.

బలాలు

బలహీనవర్గాల నుంచి వచ్చిన నాయకుడిగా అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉండడంతోపాటు వారికి అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు ఉంది. ఎక్కువ సమయం నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం కేటాయించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విరివిగా అర్హులకు అందించడం వంటి ప్రత్యేకతలు బలంగా చెప్పుకోవచ్చు.

బలహీనతలు

- ఎనిమిది సంవత్సరాలుగా వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగుతున్న పద్మారావుగౌడ్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ నాయకులకు ఎలాంటి పదవులు లభించలేదు. ఐదు డివిజన్లకు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు ఉన్నప్పటికీ పద్మారావుగౌడ్ కుమారులే అన్నీ తామై వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

కంటోన్మెంట్ : లాస్య నందిత



ఉత్కంఠ భరితంగా సాగిన కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ టికెట్ పోరులో దివంగత నేత వారసత్వం వైపే మొగ్గుచూపింది. సాయన్న కుమార్తె లాస్య నందితకు టికెట్ ఖరారు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన చేశారు. దీంతో కంటోన్మెంట్ వ్యాప్తంగా సాయన్న వర్గీయుల్లో ఒక్కసారిగా ఆనందోత్సహాలు మిన్నంటాయి.

సాయన్న వారసత్వానికే మొగ్గు

దివంగత ఎమ్మెల్యే సాయన్నకు వివాద రహితుడిగా కంటోన్మెంట్‌లో పార్టీలకు అతీతంగా మంచి పేరుంది. ఆయన మరణంతో ఒక్కసారిగా సాయన్న కుంటుంబ పట్ల సానుభూతి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పలు సర్వేలు నిర్వహించిన సాయన్న కుమార్తెకు టికెట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

2015లోనే వారసురాలిగా ఎంట్రీ..

దివంగత ఎమ్మెల్యే సాయన్న రాజకీయ వారసురాలిగా లాస్య నందిత 2015లో ఆరంగేట్రం చేశారు. ఆ ఏడాది జనవరిలో జరిగిన కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో నాలుగో వార్డు (పికెట్) నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2016లో జరిగిన జీహెచ్‌ఎంసీలో ఎన్నికల్లో కవాడీగూడ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలిచారు. 1986లో సాయన్న తొలిసారిగా ఎన్నికల్లో పోటీచేసి ప్రాంతం నుంచే (అప్పట్లో దోమల్‌గూడ డివిజన్) లాస్య కార్పొరేటర్‌గా గెలిచారు. 2021 కార్పొరేషన్ ఎన్నికల్లో కవాడీగూడ నుంచే పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సాయన్న హఠాన్మరణంతో అనూహ్యంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులోకి వచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి మూడు దరఖాస్తులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తూ సోమవారం ముగ్గురు దరఖాస్తు దాఖలు చేసుకున్నారు. నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌రావు, నాగులూరి సాయిబాబా కాంగ్రెస్ టికెట్ కోరుతూ వేర్వేరుగా తమ దరఖాస్తులను పీసీసీ నాయకులకు అందించారు. వీరు నియోజకవర్గంలో ఎవరికి వారే విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎవరికి వారు తమ అనుచరులతో గాంధీభవన్ వెళ్లిన వీరు టికెట్ తమకు దక్కుతుందన్న ధీమాలో ఉన్నారు.


పద్మారావుగౌడ్‌కు అభినందన



అభినందనలు తెలుపుతున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా మరోమారు పోటీ చేసేందుకు అభ్యర్థిత్వం ఖరారైన డిప్యూటీ స్పీకర్ టీ. పద్మారావుగౌడ్‌కు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్మిక నాయకుడు మోతే శోభన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని అన్నారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్, ఉప్పల్ నియోజకవర్గాల నుంచి మోతే శోభన్‌రెడ్డి టికెట్ ఆశించడం గమనార్హం.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో లాంజ్ ఏర్పాటు



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న దీపక్‌కుమార్

రసూల్‌పురా: పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీనియర్ సిటిజన్ల కోసం సేవా కార్యక్రమాలు అందజేస్తోందని బ్యాంక్ జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా నగరంలోని తిరుమలగిరి లాల్‌బజార్ బ్రాంచ్‌లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక లాంజ్‌ను సీనియర్ సిటిజన్స్‌తో కలిసి దీపక్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీ నుంచి పదకొండు ప్రాంతాల్లో తమ బ్యాంక్ సీఎండీ అతుల్ కుమార్ గోయేల్ పర్చువల్ పద్ధతిన ప్రారంభించారన్నారు. ఇప్పటికే సీనియర్ సిటిజన్ల కోసం డోర్ స్టెప్ సేవలతో పాటు టీవీ, న్యూస్ పేపర్స్, తాగునీటి వసతి అందుబాటులో ఉంటాయన్నారు.ఈ సందర్భంగా యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ హెడ్ బీవీ. నరేష్, బ్రాంచ్ మేనేజర్ వి. కరుణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

లాలాపేట: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్–1లో గత రాత్రి ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ. 50,130 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కేంద్ర మంత్రులుగా పనిచేసినా బేగంపేట వైపు కన్నెత్తి చూడలేదు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: కేంద్ర మంత్రులుగా పనిచేసిన సర్వే సత్యనారాయణ, బండారు దత్తాత్రేయ బేగంపేట వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే ఇక్కడి ప్రాంతవాసులకు ముంపు సమస్య దాపురించిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. బేగంపేట నాలాను అభివృద్ధి చేసి ముంపు సమస్యను పరిష్కరించాలన్న కనీస ఆలోచనను వారు చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే 17వ రోజు పాదయాత్రలో భాగంగా సోమవారం మాయూరిమార్గ్, అల్లంతోటబావి, ద్వారకాదాస్ కాలనీ, చీకోటి గార్డెన్ తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడకుండా దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సైతం పరిష్కరించడం జరిగిందన్నారు. శ్యాంలాల్ బిల్డింగ్స్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మరణిస్తే కనీసం దహన సంస్కారాలు చేసుకునేందుకు స్థలం లేని పరిస్థితి ఉండేదని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలో మూడెకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు ఏడు కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేసి ఒక మోడల్ వైకుంఠ ధామంగా తీర్చిదిద్దానన్నారు. డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో గల్లీగల్లీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామని ఇంకా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాదయాత్రలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్, రాజయ్య, సత్యనారాయణ, రఘునాథ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



బస్తీ దవాఖానా ఏర్పాటుపై చర్చిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాక నాగార్జున నగర్‌లో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్తీ దవాఖానాను సోమవారం ఆమె పరిశీలించారు. హాస్పిటల్ నిర్మాణం, ఏర్పాట్ల విషయమై డాక్టర్ రాజశ్రీతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చిందని ఇప్పటి వరకు 160 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసిందన్నారు. స్థానికులు బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డివిజన్‌లో అన్ని విధాలా అభివృద్ధి

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి పరుస్తున్నామని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎప్పటికప్పుడు డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏ సమస్య ఉన్నా మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం వంశీకృష్ణ, నాయకులు బాల్‌రెడ్డి, పురుషోత్తం, షమీవుల్లా పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి



బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ సబ్ ఏరియాలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కాంట్రాక్టు దక్కించుకున్న బెస్ట్ సెక్యూరిటీ సర్వీసెస్, ఓరియంటల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ అను కాంట్రాక్టు సంస్థలు కార్మికులకు జూన్ నెల జీతాలు నేటికీ చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయుచున్నారన్నారు. అలాంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని ముఖ్య యజమాని అయిన కంటోన్మెంట్ బోర్డు ద్వారా కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. బెస్ట్ సెక్యూరిటీ సర్వీసెస్ అను కాంట్రాక్టు సంస్థ దాదాపు రూ.12 లక్షలు కార్మికులకు చెల్లించాలని తాము యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కోర్టులో కేసు వేయగా లేబర్ అధికారులు ఆ సంస్థకు, కంటోన్మెంట్ బోర్డుకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అయినప్పటికీ సదరు కాంట్రాక్టు సంస్థ ఆ బకాయిలు జీతాలు చెల్లించకుండా వాటితో పాటు జూన్ నెల జీతాలు కూడా చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని వహిస్తున్నదన్నారు. అనంతరం కంటోన్మెంట్ బోర్డ్ శానిటరీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

వాహనం ఢీ కొన్ని వృద్ధుడి మృతి

లాలాపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన సింహాచలం (62) హబ్సిగూడలో రోడ్డు దాటుతుండగా ఉప్పల్ వైపు వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌ల చోరీ

అమీర్‌పేట: హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరి ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఆర్‌టీలోని దత్తసాయి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఆర్.శ్రీనివాసులు రాత్రి తన గదిలో ల్యాప్‌టాప్ పెట్టాడు.ఉదయం లేచి చూసేసరికి కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు.అదే విధంగా గురుద్వారా సమీపంలోని శ్రీ సిద్ధి వినాయక హాస్టల్‌లో ఉండే ఎ.దివాకర్‌కు చెందిన ల్యాప్‌టాప్‌ను కూడా ఎత్తుకెళ్లారు. ఇద్దరి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



పూజలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్



బారులుతీరిన భక్తులు

భక్తిప్రపత్తులతో నాగుల పంచమి

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో సోమవారం నాగుల పంచమి వేడుకలు భక్తిప్రపత్తులతో జరిగాయి. పెద్ద ఎత్తున మహిళలు నాగదేవత ఆలయాలను సందర్శించి పాలుపోయడం కనిపించింది. బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, గాంధీనగర్, బండమైసమ్మనగర్ నగర్, సాంబమూర్తినగర్ తదితర ప్రాంతాల్లోని నాగదేవత ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ముందు బారు తీరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గాంధీనగర్‌లోని నాగదేవత ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పద్మారావునగర్‌లోని నాగేంద్రమ్మ ఎల్లమ్మ దేవాలయాన్ని టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

క్లాక్‌టవర్ ప్రాంతంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లో నాగుల పంచమి వేడుకలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. క్లాక్‌టవర్ ప్రాంతంలోని మానస దేవి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

హస్త కళాకారులకు ప్రభుత్వం అండ

రాంగోపాల్‌పేట్: హస్త కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం రంగ్రేజీబజార్‌లోని సిక్వాలా సమాజ్ బ్రాహ్మణ సమాజ్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీజ్ మేళా ఎగ్జిబిషన్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఇంట్లో తమ పనులు తాము చేసుకుంటూ ఖాళీ సమయంలో హస్తకళల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, కోళికే కిరణ్మయి, సమాజ్ అధ్యక్షులు విజయ్ ఉపాధ్యాయ, కార్యదర్శి తులసీరాం, రామేశ్వర్ లాల్ వ్యాస్, సత్యనారాయణ ఓజా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ఠ భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పద్మారావుగౌడ్

లాలాపేట: ప్రజల సుఖశాంతులు, నియోజకవర్గ అభివృద్ధే తమకు ముఖ్యమని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం లాలాపేటలో జరిగిన బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని తాము నిరంతరం తపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షులు వంజరి ముత్యాలు, మురళి యాదవ్, మల్లేష్‌యాదవ్, అశోక్‌యాదవ్, మోహన్‌కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

- లాలాపేటలో సోమవారం జరిగిన బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి పాల్గొన్నారు. వేదపండితులతో కలిసి ప్రత్యేక భూమిపూజ చేశారు. ప్రజలందరికి శుభం కలుగాలని ఈ సందర్భంగా కార్తీకరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, శివరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: అనుమతి లేని ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతి లేకున్నా ఉందంటూ గతేడాది నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నారని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి ఓరుగంటి కృష్ణ, లెనిన్ వినతి పత్రం సమర్పించారు.

తెలంగాణ గంగ తెప్పోత్సవం కార్యక్రమం



[illegible]

కమ్యూనిటీహాల్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డీ–సెక్షన్‌లో జరుగుతున్న కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తెలుసుకొని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని వీలైనంత తొందరగా నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, లింగాని శ్రీను, ఇస్మాయిల్, రవి, గోపి, దేవయ్య, రామప్ప ఉన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం: క్రిశాంక్



మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తాను పనిచేస్తానని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె క్రిశాంక్ ప్రకటించారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం పట్ల ప్రజాభిప్రాయ సేకరణ లక్ష్యంగా పాదయాత్ర చేపట్టారు. సోమవారం పికెట్‌లోని తన నివాసం నుంచి యాత్ర ప్రారంభం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ టికెట్ కేటాయింపు ప్రకటనకు ముందే ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే తాను పనిచేస్తానన్నారు. తనకు టికెట్ కేటాయించేందుకు కేటీఆర్, కవిత ప్రయత్నాలు చేయడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇక ఎన్నికలతో సంబంధం లేకుండా కంటోన్మెంట్ విలీనం లక్ష్యంగా అన్ని వార్డుల ప్రజల నుంచి అభిప్రాయం సేకరిస్తామన్నారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు తన పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా క్రిశాంక్‌కు పార్టీ టికెట్ కేటాయించలేకపోవడం పట్ల కేటీఆర్ ట్విట్టర్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. సమర్థుడైన క్రిశాంక్ సేవలను మరో విధంగా వినియోగించుకుంటామని, ఆయనకు తగిన అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

కిడ్నాపర్ల నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు

అమీర్‌పేట: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే వ్యాపారం చేస్తున్న వ్యక్తిని అతని భాగస్వామి కిడ్నాప్ చేయగా వారి నుంచి తప్పించుకున్న బాధితుడు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రావణ్ వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌లోని ఎంపీఆర్ కాలనీకి చెందిన పొన్నం కార్తికేయ దుర్రదార్ అలియాస్ శ్రీకాంత్ (32) షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే వ్యాపారం చేస్తున్నాడు. 2015లో ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డిప్యూటీ ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌తో పరిచయం ఏర్పడగా ఇద్దరు కలిసి 60–40 శాతం ప్రాతిపాదికన షేర్ల వ్యాపారం ప్రారంభించారు. చంద్రశేఖర్ షేర్లలో పెట్టుబడి కోసం కార్తికేయకు రూ.50 లక్షలు ఇవ్వగా తీసుకున్న మొత్తానికి లాభంతో రూ.1.05 కోట్లను చంద్రశేఖర్‌కు ఇచ్చాడు.ఆ తర్వాత చంద్రశేఖర్ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రారంభించగా అందులో రూ.6 కోట్ల వరకు నష్టం వచ్చింది. కార్తికేయ చేస్తున్న వ్యాపారంలో లాభాలను అర్జిస్తుండటాన్ని చంద్రశేఖర్ జీర్ణించుకోలేక అతనిపై అక్కసు పెంచుకున్నాడు. కర్నాటక రాష్ట్రంలో అమెరికాకు చెందిన ఓ పెట్టుబడిదారు ఉన్నాడని, షేర్లలో ఎక్కువ డబ్బులు పెడతాడని కార్తికేయను నమ్మించి కర్నాటక వెళ్లేందుకు 19వ తేదీన చంద్రశేఖర్ అతని అనుచరులతో కలిసి కార్తికేయ బయలుదేరారు. కర్నాటకలోని ముథోల్ చెక్ పోస్టు సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌కు తీసుకువెళ్లి కార్తికేయను నిర్బంధించి దాడి చేశారు. అక్కడి నుండి తప్పించుకుని ముథోల్ పోలీసులను ఆశ్రయించాడు.వారి సాయంతో సోమవారం నగరానికి చేరుకున్న కార్తికేయ ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.